అడల్ట్స్ ఓన్లీ కథ

# మౌనం

హోతా పద్మినీదేవి

ఆరెంజి కలర్ ప్రింటు వున్న తెల్లని చీర, మేచింగ్ జాకెట్టు, జడలో తురుముకున్న విరజాజులతో సుషమ వెన్నెలలో స్నానించిన మల్లెపువ్వులా వుంది. మనసు మధురోహలతో కూని రాగాలు తీస్తుంటే బెడ్‌రూమ్‌లోకి వచ్చి చేతిలోని వెండిగ్లాసుని భర్తకి అందించబోయింది.

రామ్ నిర్లిప్తంగా ఆ గ్లాసువైపు చూసాడు. యాలకుల పొడి, కుంకుమపువ్వు కలిపిన ఆ పాల వైపు చూసినట్టే ఆమె వైపూ నిర్లిప్తంగా చూసాడు.

''తాగండి'' అందామె చిరునవ్వుతో.

అతను భార్యవైపు చూసాడు. నలభై అయిదేళ్ళ వయసులో కూడా పొంకం చెడని ఆమె శరీర లావణ్యం అతన్ని ఇవాళెందుకో భయపెడుతోంది. నిన్న మొన్నటిదాకా ఆమె చిరుస్పర్శకే జ్వాల లాంటి కోరిక దహించే అతని శరీరంలో ఇప్పుడు ఎలాంటి స్పందనా లేదు. కడుపునిండా అన్నం తిన్న వ్యక్తి పాయసం వైపు చూస్తున్నట్టు ఆమె వైపు చూస్తున్నాడు.


ఆమె భర్త పెదవులకి పాల గ్లాసుని అందించబోయింది.

రామ్ ముఖం తిప్పుకున్నాడు.

''వద్దు. నాకు తాగాలని లేదు''

''అదేం? రోజూ తాగుతున్నారుగా?''

''వద్దు. ఇవాళే కాదు ఇకనుంచీ వద్దు''



''ఒంట్లో బాగా లేదా?''

''నన్ను విసిగించకు'' ముఖం తిప్పుకుంటూ అన్నాడు. అతని స్వరంలోని తీవ్రతకి ఆమె హృదయం గాయపడింది. కళ్ళలో నీళ్ళు నిండాయి. పెళ్ళయిన ఇన్నేళ్ళలో అతను తనని కసురుకోవడం ఇదే మొదటిసారి. ఆమె మునిపంటితో పెదవిని నొక్కిపట్టి దుఃఖాన్ని ఆపుచేసుకోడానికి విశ్వప్రయత్నం చేస్తోంది.

రామ్ ఆమెని పట్టించుకోకుండా బెడ్‌రూమ్‌లో నుంచి వెళ్ళిపోయాడు. సుషమ చేతిలోని గ్లాసుని టీపాయ్ మీద పెట్టి అలాగే నిలబడిపోయింది. గత కొద్ది రోజులుగా భర్తలోని మార్పుకి కారణం ఆఫీసులో పని ఒత్తిడనుకుంది. కానీ ఈరోజు అతని వైఖరి ఆమెలో ఆందోళన కలిగించింది. ఏమయిందతనికి? ఒంట్లో బాగా లేదా? చెప్పుకోలేని అనారోగ్యమా? ఆమె మనసులో భయ సందేహాలు కారు మేఘంలా అలుముకున్నాయి. ఆందోళనగా ఇల్లంతా వెతికింది అతని కోసం. డ్రాయింగ్ రూమ్‌లోకి నడిచింది. గది చీకటిగా వుంది. చీకట్లో తడుముకుంటూ వెళ్ళి లైటు స్విచ్ ఆన్ చేసింది. సోఫాలో పడుకుని వున్న రామ్ ముఖం చిట్లించాడు.

''లైటార్పు'' చిరాగ్గా వుందతని స్వరం.

''చీకట్లో పడుకున్నారేం?'' లాలనగా అడిగింది.

''లైటార్పు'' కరుగ్గా ధ్వనించిందతని స్వరం ఈసారి.

ఆమె లైటాఫ్ చేసింది. చీకట్లో తడుముకుంటూ అతని దగ్గరికి వెళ్ళి అతని జుట్టులో వేళ్ళు జొనిపి మృదువుగా అడిగింది.

''ఎందుకలా వున్నారు?''

మౌనం..!

''నాతో చెప్పకూడదా?''

''దయవుంచి నన్ను ఒంటరిగా వదిలేస్తావా? లేకపోతే నన్ను ఇక్కడ నుంచి కూడా వెళ్ళిపోమంటావా?'' ఆగ్రహంగా అడిగేడతను.

ఆమె అప్రయత్నంగా చేతిని వెనక్కి లాక్కుంది.

''నేను.. నేనేం చేసాను?'' దుఃఖం నిస్సహాయత కలగలిసిన స్వరంతో అడిగింది.

చివ్వున సోఫాలో నుంచి లేచి విసురుగా బయటకి వెళ్ళిపోయాడు రామ్. కటిక చీకట్లో ఒంటరిగా మిగిలిపోయిన సుషమ కళ్లు అవిరామంగా వర్షిస్తున్నాయి.

'ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడతను? ఇటీవల కాలంలో తనతో అంటీ ముట్టనట్టు ప్రవర్తిస్తున్న అతను ఈ రోజు తనపై ప్రకటించిన అకారణ ఆగ్రహానికి కారణమేమిటి? అతనిలో తనపై ప్రేమ చచ్చిపోయిందా? లేకపోతే తను ముఖం మొత్తిందా?' సమాధానం దొరకని ప్రశ్నలు ఆమె మనసులో భుజంగాల్లా బుసలు కొడుతున్నాయి.

★ ★ ★

రామ్ కళ్ళకింద ఏర్పడిన నల్లటి వలయాలని, అతని ముఖంలోని అశాంతిని ఆందోళనగా చూస్తోంది సుషమ.

'ఏమయి వుంటుంది! అతనిలో ఇది వరకటి చురుకుదనం, లేదు. ప్రతి చిన్న విషయానికీ చిరాకుపడుతున్నాడు. తరచు అతని మూడ్ మారిపోతోంది.'

''ఒకసారి డాక్టర్ దగ్గరికి వెళ్దామా?'' ఆరోజుపొద్దుట అతను బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటుండగా సందేహిస్తూనే అడిగింది.

''ఏం, నీకు ఒంట్లో బాగా లేదా?'' ఆమె వైపు చూడకుండానే అడిగేడు రామ్.

''మీరే మధ్య అదోలా వుంటున్నారు?''

''డాక్టరు దగ్గరికి వెళ్ళేంత పెద్ద రోగమేమీ లేదు నాకు'' అతని స్వరంలోని తీవ్రతకి క్షణకాలం ఆమె మనసు చివుక్కు-మన్నా సర్దుకుని అంది...''అది కాదు. ఒకసారి జనరల్ చెకప్ చేయించుకుంటే మంచిదని. మనం నడివయసులోకి వస్తున్నాం. జాగ్రత్తగా వుండాలి''

రామ్ ముఖం మరింత నల్లబడింది.

తింటున్న ప్లేట్లులో చెయ్యి కడిగి విసురుగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

''ఏమండీ!''

ఆత్రుతగా వెనకే వచ్చిన భార్యని పట్టించుకోకుండా బ్రీఫ్‌కేసుతో బయటికి నడిచాడతను. సుషమ చూస్తుండగానే పోర్టికోలో నుంచి కారు దూసుకుపోయింది.

గుండెల్లో అగ్నిపర్వతాలు బద్దలవుతుంటే స్థాణువులా నిలబడిపోయింది.

★ ★ ★

రాత్రి పన్నెండు గంటలయింది. రామ్ రాలేదు. సుషమ బాల్కనీలో కుర్చీలో కూర్చుని అతని కోసం ఎదురుచూస్తోంది. కారు శబ్దం వినగానే, అతనేనేమో అనే ఆశ. అతను కాదని తెలిసి నిరాశ. మనసులో దిగులుగా, భయంగా వుంది.

'ఎందుకింత ఆలస్యమయిందీవేళ, ఆఫీసులో ఎంత ఇంపార్టెంట్ పనివున్నా అతను రాత్రి పదిగంటలకల్లా ఇంటికొచ్చేవాడు. ఒకవేళ మరో గంట ఆలస్యంగా వచ్చేట్టయితే ఆ విషయం ముందే ఫోన్ చేసి చెప్పేవాడు. ఉదయం అయిదు గంటలకే లేచే అలవాటున్న తనకి రాత్రి పది గంటలకల్లా నిద్ర ముంచుకొస్తుంది. ఒక్కొక్కసారి అతని కోసం ఎదురు చూస్తూ కుర్చీలో కూర్చునే నిద్రలోకి జారుకునేది. భర్త రాగానే నిద్ర కళ్ళతో వెళ్ళి తలుపుతీసిన తన కనురెప్పలపై ముద్దుపెట్టుకుని నిద్ర ఎగిరిపోయేలా చేసేవాడు. అతని స్పర్శ తన నర నరాన్ని ఉత్తేజితం చేసేది. అతని ఆగమనంతో తన మనస్సు నర్తించే మయూరమయ్యేది. ప్లేటులో అన్నం వడ్డించి అతనే తనకి, తినిపిస్తూ తను కూడా తినేవాడు. అతని లాలనలో తను పసిపాప అయితే, ఆనక బెడ్‌రూమ్‌లో అతను పసిపాపడయ్యేవాడు. చిరు అలకలు, చిలిపి తగాదాలు తప్ప తమ మధ్య ఇంత 'దూరం' ఎప్పుడూ లేదు. అసలీ దూరానికి కారణమేమిటి? ఒకవేళ అతను మరో స్త్రీ మోజులో పడి తనని నిర్లక్ష్యం చేస్తున్నాడా?' ఆ ఊహనే భరించలేకపోతోంది.

ఆలోచనలతో సతమతమవుతున్న ఆమె, రామ్ కారు హారన్ విని చప్పున కిందకి వెళ్ళి తలుపు తీసింది. లోపలికి వస్తున్న అతనికి అడ్డు తొలగి దారి ఇచ్చింది.

అతనామె వైపు చూడలేదు. ఆలస్యానికి సంజాయిషీ ఇవ్వలేదు. నేరుగా బెడ్ రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. సుషమ ముడివడిన భృకుటితో అతన్నే చూస్తోంది. అతను తనని దాటి వెళ్తున్నప్పుడు తన నాసికా పుటాలకి సోకిన పెర్‌ఫ్యూమ్ సువాసన అతను రోజూ వాడేది కాదు. కొత్తది. ఆమె గుండె కుంచించుకుపోతుంటే అనుమానం మబ్బు తెరలా మనసుని కప్పుతుంటే బెడ్‌రూమ్‌లోకి వెళ్ళింది. అతను వేసుకున్న బట్టలని గమనించిన ఆమె మనసులో అనుమానం క్షణాలలో పెరిగి వటవృక్షమయి ఊడలు దిగింది.

'పొద్దుట సూట్‌లో ఆఫీసుకి వెళ్ళిన అతను లాల్చీ పైజమాలతో ఇంటికొచ్చాడు. అంటే?' ఆమె తల తిరిగి పోతోంది. కాళ్ళలో సత్తువ లేనట్టు అక్కడున్న సోఫాలో కూలబడిపోయింది. మంచం మీద రామ్ గాఢనిద్రలో వున్నాడు.

★ ★ ★

మరో రెండు రోజులు గడిచాయి. ఇద్దరి మధ్య దూరం మరింత పెరిగింది. కాదు...సుషమ అతనికి మరింత దూరమయిపోయింది. భర్తపై కలిగిన అనుమానం అతనిపై పెంచుకున్న 'నమ్మకం' అనే మహావృక్షాన్ని, కూకటి వేళ్ళతో సహా పెళ్ళగించి కూలదోసింది. కనీసం అతనివైపు చూడ్డానికే అసహ్యం వేస్తోంది. యాంత్రికంగా అతనికి కావలసినవన్నీ అమర్చిపెడుతోంది. మానసిక సంఘర్షణ, పిచ్చి పిచ్చి ఆలోచనలు... అన్నింటినీ మించి రామ్‌కి ఆమెకీ మధ్య పెరుగుతున్న దూరం ఆమె మనసుపై గట్టి దెబ్బ తీసాయి. ఆ ప్రభావం శరీరం మీద

## మూడు రోజులు-పాతిక లక్షలు!

**హీరోయిన్లు కూడా ఐటమ్ నంబర్లు చేసేందుకు తెగ ఆసక్తి కనబరచడానికి కారణం- వారికి అందుతున్న పారితోషికాలే! తాజాగా శ్రియకి ఓ పాటలో డాన్స్ చేసినందుకుగాను ముట్టిన సొమ్ము పాతిక లక్షలట! కేవలం మూడు రోజుల పాటు షూటింగ్‌లో పాల్గొన్నందుకు ఇంత భారీ సొమ్ము అందుతుంటే ఎవరికి మాత్రం చేదు చెప్పండి. తమిళ హాస్య నటుడు వడివేలు హీరోగా నటిస్తున్న కొత్త చిత్రంలో అతనితోపాటు శ్రియ ఓ స్పెషల్ సాంగ్‌లో డాన్స్ చేసినందుకు ఈ పారితోషికంట!**



కూడా పడి వారం రోజులలో ఆమె జబ్బు పడి లేచిన దానిలా అయిపోయింది.

ఆ రాత్రి....

రామ్ బెడ్ చివరికి జరిగి పడుకుని వున్న సుషమ వీపుపై చెయ్యి వేసాడు. దాదాపూ ఇరవై రోజుల తర్వాత అతనామెని మొదటిసారిగా స్పృశించాడు. అతని స్పర్శ గొంగళి పురుగులు పాకుతున్నంత జుగుప్సని కలిగించి విసురుగా ఆ చేతిని తోసేసి ఒక్క ఊపుతో లేచి కూర్చుంది.

''నన్ను ముట్టుకోకండి'' ఆగ్రహం, దుఃఖం పోటీ పడుతున్నాయామె స్వరంలో.

''అదేం నువ్వు మడిలో వున్నావా? లేక ఏదైనా వ్రతం పట్టావా?'' అతని స్వరంలో అదే చిలిపితనం.

''మీరంటే నాకసహ్యం'' జీరబోయిందామె స్వరం.

''అరె ఏమయింది?''

''ఏమయిందో మీకే తెలియాలి?'' ఇన్ని రోజులుగా పేరుకున్న నిశ్శబ్దాన్ని మాటల డైనమేట్లతో బద్దలు కొడుతోందామె.

''మీలో నాపై ప్రేమ చచ్చిపోయింది. ఆకర్షణ చచ్చిపోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే నేను పాత బడిపోయాను. అందుకే మరో స్త్రీ మోజులో పడి నన్ను పట్టించుకోవడం మానేసారు.''

రామ్ షాకయిపోయాడు. ''ఏమంటున్నావ్?'' అప్రయత్నంగా లేచి కూర్చుంటూ అడిగాడు.

''నటించకండి'' మండిపడింది. ''రెండు రోజుల క్రిందట మీరు అర్ధరాత్రి దాటాక ఇంటికొచ్చారు. మీ నుంచి, మీరు రోజూ వాడే పెర్ఫ్యూమ్ వాసన కాదు, కొత్త పెర్ఫ్యూమ్ వాసనొచ్చింది. పొద్దుట సూట్‌లో ఆఫీసుకి వెళ్ళిన మీరు రాత్రి లాల్చీ పైజమాలతో వచ్చారు. ఆ రాత్రి ఒంటి గంట దాకా ఎక్కడ గడిపారు? మీరంత మోజుపడిన ఆ ఆడది నాకంటే అందంగా వుంటుందా?''

క్షణం తెల్లబోయిన రామ్ తేరుకుని విరగబడి నవ్వేడు.

''నేను రాముడినే సుషమా! కృష్ణుడిని కాను. నా జీవితంలో నువ్వు తప్ప మరే స్త్రీ లేదు'' నవ్వాపుకుంటూ అన్నాడు.

''అబద్ధం'' ఆమె అరిచింది.

''కాదు. ఆ రాత్రి నేను నా ఫ్రెండ్ డాక్టర్ వేణుగోపాల్ దగ్గర వున్నాను. వేణుగోపాల్ తెలుసుగా? ఆండ్రాలజిస్ట్'' నమ్మనట్టు చూస్తోంది సుషుమ.


''గత కొద్దిరోజులుగా నేను సెక్స్‌లో విఫలమవుతున్నాను. ఆ విషయం నీకూ తెలుసు. అందమైన అనుకూలవతి అయిన భార్య, యు.ఎస్‌లో ఇంజనీర్‌గా సెటిలయిన కొడుకు, మెడిసిన్ ఫైనలియర్ చదువుతున్న కూతురు, డబ్బు, సంఘంలో పొజిషన్, పేరు ప్రతిష్టలు అన్నీ వున్నాయి నాకు. అయినా లోలోపల, ఏదో అసంతృప్తి. ఏదో తెలియని నిస్సహాయత. జీవితంలో ఇంకా నేను సాధించగలిగేదేమీ లేదని నా లక్ష్యాలని చేరుకున్నాననే ఆనందాన్ని మించిన వేదన. వయసు మీద పడిపోతోందనే భావన. ఈ వయసులో నన్ను మేల్ మెనోపాజ్ పలుకరించడం కాదు ఏకంగా తిష్ఠ వేసి నా ఒళ్ళో కూర్చుంది. ప్రతీదీ చిరాగ్గా అనిపించడం, తరచు మూడ్ మారిపోవడం, నిద్రలేమి, ఒళ్ళంతా వెచ్చని ఆవిర్లు వస్తూండడం ఇవన్నీ, మేల్ మెనోపాజ్ లక్షణాలేనని డాక్టర్ వేణుగోపాల్ చెప్పాడు. ఈ లక్షణాలేమిటో తెలియక నాకేదో అంతుచిక్కని వ్యాధి వుందనే భయంతో వేణు దగ్గరికి వెళ్ళాను. అతను కన్సల్టింగ్ అవర్స్ తర్వాత నాతో చాలాసేపు మాట్లాడాడు. మాటల్లో పడి, టైము చూసుకోలేదు నేను. వేణు బలవంతం మీద అతని ఇంటికి వెళ్ళి అక్కడే స్నానం భోజనం కానిచ్చాను. నేను ఆ రోజు వేసుకున్న బట్టలు వేణువే'' క్షణం ఆగి అన్నాడు.

''ఈ విషయం నీతో చెప్తే నువ్వెలా ప్రతిస్పందిస్తావో తెలియక ఇన్నాళ్ళూ నాలో, నేనే మధనపడ్డాను. ఇవాళ చెప్పబోయేంతలో నువ్వింత తీవ్రంగా ప్రతిస్పందిస్తావనుకోలేదు'' నవ్వేడు.

''ఐయామ్ సారీ!'' గిల్టీగా ఫీలవుతూ సుషమ తలదించుకుంది.

ఇద్దరి మధ్యా కాస్సేపు మౌనం రాజ్యమేలింది.

''దీనికి పరిష్కారం? వైద్యం లేదా?''



''మందులున్నాయిట. కానీ వెంటనే మందులు వాడే బదులు జీవన శైలిని మార్చుకోమన్నారు. వ్యాయామం, యోగా బాగా మేలు చేస్తాయిట. అయినా మనం చిన్న పిల్లలమా ఏమిటి ఇంకా సెక్స్ కోసం వెంపర్లాడడానికి? మన వయస్సు పెరుగుతోందనే నిజాన్ని అంగీకరించి, వయస్సుకి తగ్గట్టు ఆలోచించడం జీవించడం చాలా అవసరం. మన అమ్మాయికి పి.జి. కాకముందే పెళ్ళి చెయ్యాలా? లేక పి.జి. చదివించి పెళ్ళి చెయ్యాలా? మనకి కాబోయే కోడలిని మనం వెతుక్కోవాలా? లేక మనవాడు ఈపాటికే ఎవరినైనా లవ్ చేసి ఆ విషయం డిక్లేర్ చెయ్యబోతున్నాడా? ఇలాంటివి''

''మీకంటే నేను ఆరేళ్ళు చిన్నదాన్ని. ఈమధ్య నాకు పీరియడ్స్ సరిగ్గా రావడం లేదు. ఒళ్ళంతా వెచ్చని ఆవిర్లు వస్తున్నాయి. ఇది మెనోపాజ్ లక్షణమే అయివుంటుంది. నేను కూడా డాక్టర్ని కన్సల్ట్ చెయ్యాలేమో!'' దిగులుగా ధ్వనించింది సుషమ స్వరం.

## మేఘన గ్లామర్ రహస్యం

**సమీరారెడ్డిలా ఎప్పుడో తెలుగునేలని విడిచి ఉత్తరాదిన సెటిలైన కుటుంబానికి చెందిన తెలుగమ్మాయి మేఘనా నాయుడు ఒకటి రెండు తెలుగు సినిమాల్లో కూడా నటించింది. బాలీవుడ్ పట్ల ఎక్కువ ఆసక్తి కనబరిచే మేఘనకి గ్లామరస్ స్టార్‌గా తనదైన ముద్ర వుంది. తన గ్లామర్ రహస్యం ఏంటని అడిగితే- మరేం లేదు ఎప్పుడూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడమే అంటుంది మేఘన. ఇంట్లో వున్నప్పుడంటే ఎక్సర్‌సైజులు, కసరత్తులు బాగానే చేస్కోవచ్చు, మరి అవుడ్డోర్ షూటింగ్‌లకెళ్ళితే కుదురుతుందా? అంటే- అప్పుడు టెన్నిస్ లాంటి ఆటలు తెగ ఆడేసి కసరత్తులు చేస్తుందిట మేఘన.**

''జుట్టు నెరిస్తే డై చేసుకుంటాం. జిమ్‌కి, బ్యూటీ పార్లర్‌కి వెళ్తూ వయసు కనబడనివ్వకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాం. కానీ ప్రకృతి ముందు మనిషి చిత్తుగా ఓడిపోతాడనడానికి ఇదో పెద్ద ఉదాహరణ. పెళ్ళయిన కొత్తల్లో ఈపాటికి మనకి చలి అంటే ఏమిటో తెలుసా అసలు?'' దుప్పటి ఒళ్ళంతా కప్పుకుంటున్న భార్యని చూసి చిలిపిగా నవ్వేడు రామ్.

పాతరోజులు గుర్తొచ్చి సుషమ ''పొండి'' అంది చిరు సిగ్గుతో భర్త గుండెలలో ముఖాన్ని దాచుకుంటూ. అతనామెని ప్రేమగా దగ్గరికి తీసుకున్నాడు.

కాంక్షని జయించిన నిజమైన ప్రేమ అది.

☆